క్లుప్తంగా

నేడు అధికారులతో ఎంపీ సమీక్ష

నారాయణవనం: తిరుపతి ఎంపీ, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త మద్దిల గురుమూర్తి బుధవారం అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు శాఖల వారీగా నిర్వహించే సమీక్షలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని పేర్కొన్నారు.

కక్ష సాధింపు చర్యలు విడనాడాలి



గ్యారేజ్ వద్ద ఎన్ఎంయూ ఆందోళన

సత్యవేడు: విశాఖపట్నం డీపీటీఓ అప్రజాస్వామిక పోకడలు, కక్షసాధింపు చర్యలు విడనాడాలని సత్యవేడు డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.చెంచులయ్య కోరారు. మంగళవారం సత్యవేడు ఆర్టీసీ గ్యారేజ్ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. డీపీటీఓ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిపోల ఎదుట నిరసన తెలుపుతున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. డిపో కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, గ్యారేజ్ అధ్యక్షుడు ఎం.నరేష్, కార్యదర్శి ఎస్.శేఖర్, సీసీఎస్ డెలికేట్ జి.సురేష్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రంగా కులగణన



సత్యవేడు: కులగణన సర్వేలో సిబ్బంది

సత్యవేడు: మండలంలోని 28 పంచాయతీల్లో కులగణన సర్వే సమగ్రంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జరీనా తెలిపారు. మండలంలోని 65 గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కులగణన చేస్తున్నారన్నారు. కుటుంబంలోని పెద్దలు వివరాలు, కుటుంబ సభ్యుల కులం, నీటివసతి, మరుగుదొడ్డి, వంటగ్యాస్, పశువులు, పంటపొలాల వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

కబడ్డీ జిల్లా పోటీలకు నాగలాపురం జట్టు



నాగలాపురం: సత్యవేడులో జరిగిన ఆడుదాం -ఆంధ్రా నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీల ఫైనల్స్‌లో నాగలాపురం జట్టు విజయం సాధించింది. పిచ్చాటూరు మండలం నీరువాయి జట్టు, నాగలాపురం జట్టు మధ్య ఫైనల్స్ జరిగాయి. నాగలాపురం సచివాలయం -1 జట్టు గెలుపొంది జిల్లా పోటీలకు ఎంపికైంది. జట్టు క్రీడాకారులను పంచాయతి కార్యదర్శి హరి, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధుశ్యామ్ అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. వెంకటగిరి మండలం, సుంకరవారిపల్లెకు చెందిన వరప్రసాద్, అదే గ్రామానికి చెందిన శ్రీహరి ఏర్పేడు పరిసర గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ జిలానీ సిబ్బందితో వెంబడించి పట్టుకున్నట్లు వివరించారు. 13 బస్తాల బియ్యం, ఆటో స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

రేణిగుంట: రేణిగుంట రైల్వే జంక్షన్‌లో తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్‌షాను మంగళవారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో రైళ్లలో మత్తు పదార్థాలు అక్రమ రవాణా అవుతున్నాయా..? అనే అనుమానంతో తనిఖీలు చేశారు. వెయిటింగ్ హాళ్లలో, పలు రైళ్లలోని వివిధ కోచ్‌లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎవరైనా గంజాయి, మద్యం, వంటివి అక్రమంగా రైళ్లలో తీసుకెళుతున్నారా..? అనే కోణంలో అనుమానితుల బ్యాగులను తనిఖీ చేశారు. ఆమెతోపాటు రేణిగుంట జీఆర్పీ సీఐ దేవేంద్రకుమార్, ఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తారంగా కాకర సాగు



కనమనంబేడులో కాకర పంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువత్తూరు, కనమనంబేడు, జీఎన్‌కండ్రిగ, కాంపాళ్లెం, గ్రామాల్లోని రైతులు కాకర పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. సుమారు 30 ఎకరాల్లో కాకర పంటను వేశారు. ఆరుతడి పంట కావడంతో మెట్ట భూముల్లో పంటను ఎక్కువ సాగు చేస్తున్నారు. కాకరకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఎకరాకు అన్ని ఖర్చులు పోనూ రూ.30 వేలు మిగులుతుందని రైతులు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఎంపీ నిధులు

- తిరుపతి ఎంపీ గురుమూర్తి
- అధికారులతో అభివృద్ధిపై సమీక్ష
- రూ.3కోట్లతో పలు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు
- కేవీబీపురంలో ఎంపీ సుడిగాలి పర్యటన



పార్టీ శ్రేణులతో కలిసి సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి

కేవీబీపురం: కేవీబీపురం మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు, సమస్యల పరిష్కారానికి ఎంపీ నిధులు కేటాయిస్తున్నట్లు తిరుపతి ఎంపీ, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త మద్దిల గురుమూర్తి తెలిపారు. మంగళవారం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. సమస్యలపై ఆరా తీశారు. ప్రతి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయిస్తూ, పలు సమస్యలపై జిల్లా అధికారులతో మాట్లాడారు. నాలుగున్నర ఏళ్ల నుంచి మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ మండలంలోని కళత్తూరు, పెరిందేశం, కాట్రపల్లి, అంజూరు, వేమళపూడి, ఆదవరం గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని ఆదేశించారు. పంచాయతీల వారీగా తాగునీరు, పంట కాలువల అభివృద్ధి, వీధిలైట్లు వంటి సమస్యలపై ఆయా సర్పంచ్‌ల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించేందుకు రూ.3 కోట్లు ఎంపీ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ గురుమూర్తి

రైతులను ఇబ్బందులు పెట్టవద్దు

మండలంలోని వేమళపూడి, ఆదవరం, బంగారమ్మ కండ్రిగ, వడ్డికండ్రిగ, మిద్దికండ్రిగ తదితర గ్రామాల్లో 70 ఏళ్లుగా పట్టాలు కలిగి సాగు చేసుకుంటున్న పట్టా భూములను అటవీ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్‌గా మార్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఎంపీ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ద్వారా సమాచారం తెలుసుకుని జిల్లా అటవీశాఖా అధికారులతో ఎంపీ మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోసారి అధికారులతో మాట్లాడుతానని రైతులకు తెలిపారు.

హాస్టల్ అభివృద్ధికి రూ.3 లక్షలు

మండల కేంద్రంలోని ఎస్సీ,ఎస్టీ బాలుర హాస్టల్ అభివృద్ధికి ఎంపీ గురుమూర్తి రూ.3 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ హాస్టల్ టీడీపీ హయాంలో 2016లో మూతపడింది. ఆ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఎంపీ మంగళవారం పరిశీలించారు. అక్కడ అవసరమైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.3 లక్షలు కేటాయించేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు.

సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ

స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ సిద్ధం పోస్టర్లను నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఎంపీ ఆవిష్కరించారు. ఈ కా ర్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్లకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మూర్తి మునెమ్మ, నేతలు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయరెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుబ్బయ్య, మోహన్‌నాయుడు, అయప్పరెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలాలయ స్థాపన రేపు



పశుగ్రాసం అందజేస్తున్న దాత రాజగోపాల్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా వెలసిన ఏడుగంగమ్మల ఆలయంలో గురువారం బాలాలయ స్థాపన ఉంటుందని చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం వాస్తుపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు వాస్తు పూజ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 1న ఉదయం 9 నుంచి 10.25 గంటల లోపు బాలాలయ స్థాపన ఉంటుందని పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. శ్రీస్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు కె.ఆనంద్, గరికపాటి రమేష్‌బాబు, అమర్‌నాథ్, వాసు యాదవ్, ఢిల్లీబాబు, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలకు తిరుపతికి చెందిన కె.రాజగోపాల్ మంగళవారం రూ.21వేలు విలువజేసే రెండు ట్రక్కుల పశుగ్రాసాన్ని అందజేశారు. పాలకమండలి చైర్మన్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపి శ్రీస్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు ఆలయ అధికారి సురేష్‌రెడ్డి, ప్రముఖులు కల్యాణ్‌కృష్ణ, కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానాలు సాధ్యం



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ తీర్థంలోని గిరిజనకాలనీలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు కోవాలని, విద్యతోనే ఉన్నత స్థానాలు సాధ్యమన్నారు. విద్యాహక్కుపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే న్యాయ సహాయ సహకార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం పొందవచ్చని తెలిపారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీరామ్, పారా లీగల్ వాలంటీర్లు వాసు, యాసిన్, లీగల్ ఎయిడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం

ఏర్పేడు: ప్రారంభ దశలో కుష్టు వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేట, మేర్లపాక గ్రామాల్లో కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ అయిన పిదప మొదటి నెల ఆస్పత్రిలో, రెండవ నెల నుంచి ఏఎన్ఎం ద్వారా ఇంటి వద్దనే మందులు తీసుకోవచ్చాన్నారు. సర్పంచ్‌లు, ఏఎన్ఎంలు సుజాత, ఉష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు పాఠశాలలో..

సత్యవేడు: కుష్టు వ్యాధిని నిర్మూలిద్దామని ఏఎన్ఎం డి. లతాదేవి అన్నారు. మంగళవారం సత్యవేడు ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. వివక్షతను ముగిద్దాం-గౌరవాన్ని స్వాగతిద్దాం అనే నినాదం పోస్టర్లను విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం సి. నాగేంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

సత్యవేడు: రాష్ట్రంలో ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. మంగళవారం పీవీపురం సచివాలయం పరిధిలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు ఏ. నాగమ్మ, సర్పంచ్ ఏ.పోలమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో పేదలకు పెద్ద జబ్బులు వస్తే మరణమే శరణ్యం అనేలా పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యనికి రూ.25 లక్షలను పెండమే కాక, పథకం కింద వర్తించే వ్యాధుల సంఖ్యను కూడా పెంచారన్నారు. వైద్య శిబిరంలో తిరుపతి రుయా వైద్యశాల డాక్టరు మోహన్‌బాబు(ఆర్థోపెడిక్), చిన్నపిల్లల డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ తేజశ్విని(కంటి పరీక్షలు, పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అనిత, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ మొత్తం 279 మందిని పరీక్షించి మందులు అందజేశారు. 40 మందికి కంటి పరీక్ష చేశారు. ఐదుగురిని ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. ఎంపీటీసీ నాగమ్మ, సర్పంచ్ పోలమ్మ పంచాయతీ సెక్రటరీ రజిత, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పట్టించుకోండి

- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- వరదయ్యపాళెం మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మప్రియ

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ఆ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు నిలదీశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కారిపాకం, పులివల్లం, గూడలవారిపాళెం, పాండూరు, యానాదివెట్టు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విద్యుత్ సమస్యలపై ప్రస్తావించారు. పలుచోట్ల పోళ్లు నాటి లైన్లు లాగలేదని, మరికొన్నిచోట్ల చిన్నపాటి సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ పద్మప్రియ మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ ద్వారా పంచాయతీల వారీగా సమస్యలను గుర్తించి తనకు నివేదిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మెటీరియల్ మంజూరు చేయిస్తానని తెలిపారు.

గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్

విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఇకపై గ్రామాల్లో కూడా త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించనున్నామని, పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. మండల పశు వైద్యాధికారిణి గౌరి మాట్లాడుతూ.. వైఎస్సార్ పశు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉపాధి ఏపీఓ భాస్కర్ మాట్లాడుతూ..గ్రామ సభల ద్వారా పనులను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అందరి సమన్వయంతో మండలాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తామని తెలిపారు. అన్నివర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. దేశం ఆంధ్రప్రదేశ్ వైపు చూసే విధంగా అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామస్థాయిలో ప్రత్యేక చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఆర్ఐ వేణుగోపాల్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలు శాఖల అధికారులు గైర్హాజర్

సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అన్నిశాఖల అధికారులు హాజరుకాలేదు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్యాధికారులు, అటవీశాఖ, ఆర్టీసీ, వెలుగు, ఆర్ అండ్ బీ, విద్యుత్‌శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీనిపై సభ్యులు ఎంపీడీఓను నిలదీయడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

అన్ని సబ్జెక్టులపై మక్కువ పెంచాలి



విద్యార్థిని ప్రశ్నిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా బోధన చేస్తూ, అన్ని సబ్జెక్టులపై మక్కువ పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలను వారు తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు కలిగిస్తూ, సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. హోమ్‌వర్క్ నోట్స్ పరిశీలించి, తప్పులను సరిదిద్దాలని తెలిపారు.

బస్సుల కోసం నిరీక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, అరిగిలకండ్రిగ, వీఎస్‌పురం, పద్మావతిపురం, పదవమైలు గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఈ గ్రామాల నుంచి బుచ్చినాయుడుకండ్రిగ, పల్లమాల గ్రామాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రోజూ 70 మంది విదార్థులు బస్సుల్లో వెళుతున్నారు. బస్సులు సకాలంలో రాక పోతుండడంతో పాఠశాలకు సమయానికి వెళ్లలేక పోతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండవలసి వస్తోందని, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను సమయానికి నడిపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వలంటీర్‌పై టీడీపీ నేతల దాడి



రక్తగాయాలతో బాలాజీ

నాగలాపురం : మండలంలోని అచ్చమనాయుడు కండ్రిగ వలంటీర్ జి.బాలాజీ (34)పై టీడీపీ నేత సుధాకర్ దాడి చేశాడు. బాలాజీకి చిన్నాపట్టు గ్రామానికి చెందిన టీడీపీ నేత సుధాకర్ రూ.14 లక్షలు బాకీ ఉన్నాడు. అప్పు చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా సుధాకర్ వాయిదాలు తీసుకునేవాడు. దీనిపై పెద్దమనుషులు సైతం జోక్యం చేసుకుని మధ్యస్తాలు చేశా రు. ఈ క్రమంలో మంగళవారం గట్టిగా నిలదీయడంతో సుధాకర్ అనుచరులు పదిమందితో కలిసి దాడికి దిగాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ పద్మలత

ఏర్పేడు: ఎస్సీ, ఎస్టీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తిరుపతి సీఐడీ డీఎస్పీ, ఆర్వో పద్మలత అన్నారు. మంగళవారం మండలంలోని చితంలపాలెం ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ చట్టం- 1989పై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు అక్షరాస్యతా లోపం, చట్టాలపై అవగాహనాలేమితో న్యాయం అందక హక్కులను కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం అందించే రిజర్వేషన్ల ద్వారా మంచి ఉద్యోగాలను పొందవచ్చన్నారు. ఫ్రెండ్లీ పోలీసు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలపై నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సత్వరమే న్యాయం పొందవచ్చన్నారు. బాల్యవివాహాలను రూపుమాపాలన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలన్నారు. కుల వివక్ష నిర్మూలనకు సివిల్ రైట్స్ యాక్ట్‌ను ప్రభుత్వం 1989లో ప్రవేశపెట్టిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగినప్పుడు పోలీస్ కేసులతో పాటు సివిల్ కేసులు కూడా పెట్టవచ్చన్నారు. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు, ఎస్ఐ జిలాని, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, న్యాయవాది ఉదయ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి తులసి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలుచోట్ల మద్యం స్వాధీనం: నిందితులకు రిమాండ్



బుచ్చినాయుడుకండ్రిగ: నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ సమీపంలో మంగళవారం మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు ..శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని కొత్తకండ్రిగ వద్ద ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేస్తున్నారు. బోనుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన వేణుగోపాల్ 20 మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా గుర్తించి, స్వాధీనం చేసుకు న్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

గుంటకిందపల్లె వద్ద

శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లె వద్ద మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు గుంటకిందపల్లెకు చెందిన చేమూరు అంకిరెడ్డి(50) గ్రామానికి సమీపంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించగా 22 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

పాతవీరాపురంలో

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో అక్రమంగా విక్రయిస్తున్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. ముందస్తు సమాచారం దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బంగ్లాతోట గ్రామంలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తూ, మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో మంగళవారం ఎస్ఐ వెంకటనరసింహ సిబ్బందితో దాడి చేశారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న రమేష్‌ను అదుపులోకి తీసుకుని, పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు రేగస్, నరేష్ పాల్గొన్నారు.

బాపూజీ ఆశయాలు సాధిద్దాం



అన్నదానం చేస్తున్న శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో భక్త కన్నప్ప వర్తక వ్యాపార బృందం ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయ రాజగోపురం ముందున్న గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అన్నదానం చేశారు. గిరిప్రసాద్‌గౌడ్, కల్యాణ్, బాలగౌడ్, బత్తెయ్య, సిద్ధులయ్య, పవన్, దేవేంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

అనుసరణీయం

మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గాంధీజీ పాటించిన సత్యం, అహింస, నిరాడంబరత్వం నేటి యువతకు అనుసరణీయమన్నారు.ఎన్ఎస్ఎస్ పీవోలు నాగయ్య, సుధీర్, అధ్యాపకులు గంగారామ్, మునెయ్య, రాజేంద్రుడు, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత బడి బస్సు డ్రైవర్లదే

శ్రీకాళహస్తి : పాఠశాల విద్యార్థులను భద్రంగా గమ్యం చేర్చాల్సిన బాధ్యత పాఠశాలల బస్సు డ్రైవర్లదేనని శ్రీకాళహస్తి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లె సమీపంలోని ఎంవీఐ కార్యాలయంలో మంగళవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగంతో, మద్యం, మత్తు పదార్థాలను సేవించి, మొబైల్‌లో మాట్లాడుతూ బస్సు నడప కూడదని తెలిపారు. బస్సులో విద్యార్థులను ఎక్కించుకునేందుకు, దించేందుకు ఓ సహాయకుడిని పాఠశాల యాజమాన్యం నియమించాలని పేర్కొన్నారు. శుకబ్రహ్మాశ్రమం కంటి ఆస్పత్రి వైద్యుల సహకారంతో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదరనాయుడు